# సెకండ్ హనీమూన్

—మువ్వా శ్రీనివాస్

సప్పర్ లాగించేసి రిమోట్ ప్లే చేసి 'స్టార్ ప్లస్' ఛానెల్ చూస్తూ సోఫాలో సెటిలయ్యాడు కళాకృష్ణ. ఇంతలో కిచెన్‌లో అన్నీ సర్దేసి వచ్చి భర్త పక్కన కూర్చుంటూ అతని చేతిలోని రిమోట్ లాక్కుని ఛానెల్ మార్చింది సావేరి.

టీవీ స్క్రీన్ మీద ప్రసార మౌతున్న సోకాల్డ్ 'మిడ్ నైట్ మసాలా' కార్యక్రమం ఆమెను రెచ్చ గొట్టింది కాబోలు అంతే భర్త మీదకు జారిపోతూ "ప్లీజ్ అండీ! వెన్నెల కురిసి చాన్నాళ్ళయిందిగా" అంది గోముగా.

భార్య అలా టెమ్టింగ్‌గా అవే సరికి ఉత్సాహం ఉత్తేజం కలిగింది కాబోలు కళాకృష్ణ ఎప్పట్లా 'అబ్బే! మూడ్ లేదు' అనకుండా బెడ్‌రూమ్‌లోకి ఆమెను అలాగే అక్కున చేర్చుకుని దారితీశాడు.

ఆ సమయాన భర్త గాఢ పరిష్వంగంలో దప్పిగకొన్న లేడి దాహం తీర్చుకున్నట్లుగా ఆ 'లేడీ సావేరి' నలిగిపోతోంది. ఆలా నలిగిపోతూనే ఎక్కడ భర్త మూడ్ మధ్యలోనే అవుట్ అయిపోతుందేమోనన్న భయంతోనో ముందు జాగ్రత్తతోనో అతన్ని బాగా ఉత్తేజ పరచడానికి శతవిధాలా ప్రయత్నిస్తోంది.

వీణను ఎక్కడ ఎలా శృతిచేస్తే రాగ రసరంజకం అవుతుందో బాగా తెల్సిన వాడిని విద్వాంసు డంటారు. కానీ ఇక్కడ విద్వాంసుడిని ఎక్కడ ఎలా స్పందింప చేస్తే తీగలను హృద్యంగా శృతిచేయగలడో తెల్సిన వీణలాంటి జాణ సావేరి!

రససిద్ధి పొందకుండానే రాగాలాపన అర్ధాంతరంగా ఆపేస్తే రసాభాస అవుతాడని తనకు తెల్సు. అలా ఎన్నిసార్లు ఆమె ముందు రసాభాస కాలేదు? అందుకే కళాకృష్ణ తనవంతు కృషి తాను చేస్తూనే వున్నాడు. 'హ్యోషివేషన్ టెక్నిక్'ను అప్లయ్ చేయడంతోనహా! గోడ గడియారం తాలూకు శబ్దమే కాబోలు...టక్...టక్... టక్...టక్...ఉన్నట్లుండి పక్క మంచం మీద పడుకున్న వాళ్ళ మనవడు 'బేర్‌ర్‌ర్' మంటూ ఏడుపు లంకించుకున్నాడు. దట్సాల్! ఆకాశాన్ని తాకబోయిన 'అల' తాకకుండానే 'మూడ్ అవుట్' అవడంతో చప్పన నేలను తాకింది. దాంతో సావేరికి ఎక్కడ లేని కోపం ముంచుకొచ్చింది. మనవడికి రెండు అంటించాలన్న ఆవేశాన్ని అతి కష్టమ్మీద అవుకుంది. పైకిలేచి చీర సవరించుకుని ఆ పిల్లాడ్ని ఎత్తుకుని మంచినీళ్ళు తాపించడానికై కామన్ హాల్లోకి వచ్చింది.

ఎదురుగా వున్న బెడ్‌రూమ్‌ను చూసేసరికి చాలా చిరాకనిపించింది. అది తన కొడుకు కోడలకు కేటాయించిన గది. వాళ్ళ సుపుత్రుడే ఇందాక తన ఏడుపుతో అంతరాయం కలిగించి రసాభాస చేసింది.

'వీడ్ని వాళ్ళ గదిలోనే పడుకోబెట్టుకోవచ్చుగా ఛీఛీ!' లోలోపలే చిరాకుపడింది. సావేరిలో ఎక్కడలేని అసంతృప్తి, అర్ధాకలి భావన ముంచుకొచ్చాయి.

'ఆ! ఈ రోజంటే వీడు నిద్ర మెలకువొచ్చి పాడుచేశాడు కానీ ఇంతకు ముందు ఎన్నిసార్లు ఈ మహానుభావుడు మధ్యలోనే మూడ్ అవుట్ అయిపోయి అసంతృప్తి మిగల్చలేదు' అనుకుంది లోలోపల.

అమధ్యేదో పత్రికలో వృద్ధ దంపతులమీద చదివిన జోక్ గుర్తొచ్చింది. అదేంటంటే– "ఏమండీ! చాన్నాళ్ళయిందండీ" అని భార్య అంటే "చాన్నాళ్ళెక్కడయిందే నీ మతిమరుపు మండా. కల్సి సంవత్సరమేగా అయింది" అంటాడా ముసలి భర్త.

అప్పుడు ఆ జోక్ చదివి నవ్వుకుంది. కానీ ఇప్పుడు తన జీవితంలో అదే హాస్యం వాస్తవమై తనని అపహాస్యం చేస్తుంటే అసంతృప్తితో ఏడుపు ముంచుకొస్తుంది సావేరికి.

అయినా నలభై ఏడేళ్ళకే వృద్ధాప్యం వచ్చేసిందా తన భర్తకు? పత్రికల్లో సెక్స్ స్పెషలిస్టులకు డెబ్బై ఏళ్ళు నిండిన వాళ్ళు కూడా 'రోజూ కలుస్తాము. కలవొచ్చా లేదా' అంటూ ఉత్తరాలు రాస్తుంటారే! ఓ వేళ తన భర్తకు డయాబెటిస్ కానీ లేదు కదా!? గతం నెలలో చేసిన పరీక్షల్లో నిల్ రిపోర్ట్ వచ్చింది గదా మరి! బీపీ కూడా నార్మల్‌గానే వుంది.

ఆమెలో ఎన్నో ప్రశ్నలు...అనుమానాలు!

మనవడితోపాటు భర్త కూడా మంచి నిద్రలోకి జారుకున్నాడు. మళ్ళీ భర్తను నిద్రలేపే ప్రయత్నం చేయబుద్ధి కాలేదు. ఇక రాత్రి ఆమెకు నిద్ర పట్టదు. జాగరణ తప్పదు.

అదే పెళ్ళయిన మొదట్లో వెన్నెల ధారాపాతంగా కురుస్తుంటే జాగరణ! కానీ ఇప్పుడు వెన్నెల కరువై జాగరణ! అన్నట్లు దాంపత్య సుఖానికి వాళ్ళు పెట్టుకున్న కోడ్‌వర్డ్–వెన్నెల కురవడం.

ఓ వేళ తన భర్తకు కళత్రయ దోషం కానీ పట్టుకుందా? ఊహూ! పేరుకు కళాకృష్ణ అవే కానీ శ్రీరామ చంద్రుడిలాంటి ఏకపత్నీ వ్రతుడు తన భర్త. అందులో అనుమానం లేదు.

ఆ మధ్య అంటే...ఓ ఏడాది క్రితం ఏవో మందులు మాకులు, పసర్లు, చెట్టు వేర్లు, స్ప్రేలు, ఇంజక్షన్లు, 'విటమిన్–ఇ' గట్రా క్యాప్సిల్సు, ఇంకా ఏవో ఏవేవో తీసుకునేవారు పత్రికల్లో యాడ్సూ, ఆర్టికల్సూ చదివి. అవి తీసుకున్నప్పుడు మాత్రం ఫర్వాలేదు ఏదో ఏవరేజ్‌గా వెన్నెల కురిపించేవారు. అసలు అలాంటివి వాడకూడదని వాటి వలన సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువగా వుంటాయని తన ఫ్రెండ్ బృందావని చాలాసార్లు చెప్పింది. కొంపముంచి వాటి ప్రభావంతో కానీ ఆయన ఇలా తయారవ్వలేదుగదా!

సావేరి వయస్సు ఫార్టీ ప్లస్ అయినప్పటికీ ఇంకా ఆమెకు 'వెన్నెల కురవడం' మీద ఏమాత్రం వ్యామోహం తీరలేదు. 'ఆ వయస్సులో కొందరి ఆడవాళ్ళకు మళ్ళీ తిరిగి తోడుతుంది మోహం' అని వాత్సానుడో లేక మరో ఉత్సాహవంతుడో చెప్పింది ఆమె విషయంలో నిజం అయింది.

అంతేకాదు సావేరి ఫార్టీప్లస్ అయినా ఆమె



24-07-98 ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక *



రూపంలో ఇంకా బింకం ఏమాత్రం చెక్కు చెదరలేదు. స్వర్ణ కాంతిలా చిక్కగా, నింగిన మెరిసే చుక్కలా, వడిరేయి సంద్రాన చుక్కానిలా, ఆమె మోము దర్శించడమే 'లక్కు'లా, అప్సరు ముందే తెల్పిన లెక్కలా, అందం ఆమె హక్కులా— అప్పడే సంతకం అయిన బ్లాంక్ చెక్కులా, ఒక్క ముక్కలో చెప్పలేని ది మోస్ట్ బ్యూటీఫుల్ ఛార్మింగ్ లేడీ...సావేరి!

లేసొచ్చి హాల్లో కూర్చుని టివి ఆన్ చేసింది. అదే పనిగా ఛానెల్స్ మార్చింది. ఏ ప్రోగ్రామ్ మీద కూడా ఏకాగ్రత కుదర్చలేక పోయింది. అప్పుడు చూసింది చిన్నకూతురు రూమ్‌లో లైట్ వెలుగుతోంది ఇంకా.

పైకి లేచి చిన్న కూతురు గదిలోకి దారి తీసింది సావేరి తలుపు తెరుచుకుని. "రేపు ఎసైన్‌మెంట్ వుంది మమ్మీ. అందుకే చదువుకుంటున్నా" అంది తల్లిని చూడగానే ఆమె.

సావేరి ఏమీ మాట్లాడకుండా అక్కడున్న సింగిల్‌కాట్ మీద అలాగే వాలిపోయింది. ఉన్నట్లుండి కూతురు అడిగింది "ఏంటి మా! ఈ మధ్య నీవు బాగా డల్‌గా ఏదో పోగొట్టుకున్న దానిలా వుంటున్నావ్?"

"అవును! పోగొట్టుకున్నదానిలానే వుంటున్నాను. రోజూ 'వెన్నెల'ని పోగొట్టుకుంటున్నానుగా మరి! నా సమస్య నీకర్థం కాదులే' అనుకుంది సావేరి మనసులో నిర్వేదంగా.

'తన భర్తకు యవ్వనం రివైజ్ అయి మళ్ళీ శోభనం రోజులు తిరిగొస్తే ఎంత బావుణ్ణు! వెన్నెల కురిసే మధుర క్షణాలలో మాత్రమే దేహం దేవాలయమౌతుంది. ఆ తర్వాతంతా కేవలం మాంసపు ముద్దగానే మిగిలిపోతుంది' ఆ విరహోత్కంఠితలో మోహావేశం వింతగా. ..వింత వింతగా విపరీతం కాసాగింది!

* * *

కళాకృష్ణ అప్పుడప్పుడు ఆఫీసు పని మీద మద్రాస్ వస్తుంటాడు. అలాగే కాన్ఫరెన్స్‌కు హాజరవ్వడానికి వస్తుంటే ఈసారి సావేరి కూడా వెంట బడింది "నేనూ వస్తాను మీతో" అంటూ! దాంతో కాదనలేక పోయాడతను.

అలా మద్రాస్ వచ్చి ఆఫీస్ గెస్టు హౌస్‌లో దిగి ఫ్రెష్షయిపోయి వెంటనే కాన్ఫరెన్స్‌కు వెళ్ళిపోయాడు కళాకృష్ణ. అలా వెళ్తూ వెళ్తూ బోయ్స్‌కు మరీ మరీ చెప్పాడు "అమ్మగారికి ఏం కావాలో జాగ్రత్తగా చూసుకోండి" అంటూ.

సావేరికి అక్కడ ఏసీ రూమ్‌లో ఏకాంతం చాలా వింతగా అనిపించింది. ఇంతలో పిలవకుండానే బోయ్ వచ్చి "పిలిచారా మేడమ్?" అన్నాడు.

వచ్చినప్పట్నుంచి వాడలా ఏదో వంక కల్పించుకుని వచ్చి తనవైపు కళ్ళప్పగించుకుని చూడటం గమనించకుండా వుండలేక పోయిందామె.

ఆ కుర్రాడి వివరాలు అడిగి తెల్సుకుంది సావేరి. "డబ్బిస్తాను. ఓ పని చెబితే చేస్తావా?" అడి

గింది. 'డబ్బులివ్వక పోయినా మీ కోసం ఏ పనైనా చేస్తాను' అనుకున్నాడా కుర్రాడు ఆనందంగా లోలోపల.

ఆమె హ్యాండ్ బ్యాగ్‌లోంచి డబ్బు తీసి అతని చేతిలో పెట్టి పనేమిటో వివరించింది.

"అంటే మీరు రెండు రోజులే వుంటారా ఇక్కడ?" బాధపడిపోతూ అన్నాడా కుర్రాడు ఆమె మాటలు విన్నాక. ఆమె అవునంటూ తలూపింది.

ఆ రెండు రోజులూ కళాకృష్ణ చాలా బిజీగా ఓ రోజైతే అసలు రాత్రి కూడా రాలేక పోయాడు.

"హమ్మయ్య! వచ్చిన పనైపోయింది. రేపే మన రిటర్న్ జర్నీ" అన్నాడు. ఆ మాటలకు సావేరి ఏమీ బదులివ్వలేదు కానీ తర్వాత రోజు భర్త తయారవుతుంటే అతని చేతిలో రిజర్వేషన్ టికెట్స్ వుంచి చెప్పింది.

"ఈ రోజు మనం నీలగిరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేయబోతున్నాం"

అతనునమ్మలేనట్లుగా "వాద్యూయూమీన్? అసలు రిజర్వేషన్ ఎవరు చేశారు?" అడిగాడు ఆశ్చర్యంగా. "ఇక్కడున్న బోయ్‌కు డబ్బులిచ్చి చేయించాను. అంతేకాదు మన రిటర్న్ జర్నీ టికెట్స్ కూడా క్యాన్సిల్ చేయించి మరో నాలుగు రోజుల తర్వాతకు చేయించాను. ఆ కుర్రాడు పాపం చెప్పగానే చేసుకొచ్చాడు" అంది వివరిస్తూ.

"నోనో! నేను వెంటనే వెళ్ళి ఆఫీసులో రిపోర్ట్ సబ్‌మిట్ చేయాలి" అన్నాడు కళాకృష్ణ కుదరదన్నట్టుగా.

"అలాగయితే మీరెళ్ళండి. నేను ఆ రూమ్ బోయ్‌ను తీసుకుని వెళ్తాను ఏం చేస్తాం" అంది ఎంతో 'నాటీ'గా చిలిపి నవ్వు నవ్వుతూ.

అంతే! ఆమె జోవియల్‌గా క్యాజువల్‌గా అన్న మాటలను సీరియస్‌గా తీసుకున్నాడు కాబోలు "ఓకే! ఇట్సాల్ రైట్" అంటూ ఫోన్లో వాళ్ళ యూ.డి.ని కాంటాక్ట్ చేసి పర్మిషన్ తీసుకుని రిపోర్ట్ కొరియర్ ఫ్లయిట్ సర్వీస్‌లో పంపించాడు కళాకృష్ణ.

ఆ రాత్రి మద్రాసులో బయలుదేరిన ఆ ఎక్స్‌ప్రెస్ తెలతెల వారుతుండగా మెట్టుపాలెంలో ఆగింది. అక్కడ కళాకృష్ణ, సావేరి టాయ్ ట్రెయిన్ ఎక్కి అందమైన పచ్చని చెట్లను, హృద్యమైన ప్రకృతి సౌందర్యాన్ని కొండలను కోనలను చూస్తూ ఆనందంగా ఉరుకులు పరుగులతో పయనం సాగిస్తున్న ఆ ట్రెయిన్లో ఉదకమండలం చేరుకున్నారు.

దాదాపు ఇరవై ఐదేళ్ళ క్రితం అంటే తమ పెళ్ళయిన కొత్తలో గడిచిన రోజులు కళ్ళ ముందు తిరిగాయి వాళ్ళిద్దరికీ. అప్పుడు కూడా వాళ్ళు తమ హనీమూన్ ట్రిప్‌గా ఇక్కడికే ఊటీకే వచ్చారు. ఆ రోజుల్లో ఊటీకి హనీమూన్‌కు రావడమంటే అదో పెద్ద సెన్సేషనల్ థింగ్!

లక్కీగా ఓ స్టార్ హోటల్లో ఈజీగానే సూట్ దొరికింది. వెంటనే ఫ్రెష్షయిపోయి కాస్త స్టఫ్ తీసుకుని బయట పడ్డారు.

కొత్తగా పెళ్ళయిన జంటలానే చేతులు పట్టుకుని వలపు రాగాలు ఆలపించుకుంటూ ప్రాకృతిక అందాల సౌరభాలను ఆఘ్రాణిస్తూ తనువుల్ని జలదరింప చేస్తున్న మంచు పొగల్లో ధూప స్నానమాచరిస్తూ బొటానికల్ గార్డెన్‌లో, పచ్చిక బయళ్ళలో, టీ తోటలో పరుగులెడుతూ 'హైడ్ అండ్ సీక్' ఆటలాడుతూ అక్కడ నీలగిరి సాక్షిగా తిరిగి పడుచు జంటై ఆనందంలో మునిగి తేలారు మిస్టర్ అండ్ మిసెస్ సావేరీ కళాకృష్ణ.

---

గమనిక:

17-7-98 సంచికలో ఈ వారం'సరసం' కథ రచయిత భమిడి వెంకటేశ్వర్లుగా గమనించగోర్తాం.

---

తిరిగి హోటల్ రూమ్ చేరేసరికి చాలా సమయమైంది. అతను బద్ధకించినా ఆమె ఊరు కోలేదు. బలవంతంగా సరిగంగ స్నానాలతో సమయం మర్చిపోయేట్లు చేసింది.

వెరైటీగా వుంటుందని నైటీ వేసుకుంది. ఏదో లైట్‌గా సప్పర్ చేశాక లైట్ తీసేయబోతుండగా ఆమె వద్దని వారించింది. "వెలుతురులో వెన్నెల కురిస్తే ఇంకా వెరైటీగా వుంటుందేవ్" అని ఏరోటిక్‌గా అంటూ ఆ నైటీని కూడా తీసేసి పూర్తి బర్త్ డే సూట్‌లోకి వెళ్ళిపోయిన ఆమెని చూసేసరికి కళాకృష్ణలోని విద్యాంసుడి మత్తు ఒక్కసారిగా వదిలిపోయింది.

"వెన్నెల కావాలామ్మా?!" అడిగింది గోముగా దగ్గరగా వచ్చిన భర్తకు దూరంగా జరుగుతూ. కావాలనే అతన్ని ఏడిపించాలని. "ఇదేమీ హైడ్ అండ్ సీక్ ప్లే కాదు. బెడ్ టైమ్!" అంటూ ఒక్క అంగలో ఆమెను దగ్గరకు లాక్కుని ఆమె రాజ్యంపై యుద్ధం ప్రకటించి వీరావేశంలో యువరాజులానే పోరాడి ఆమెను అధీన పర్చుకుని విజగర్వంతో ఆమెను గెలిచాడు.

అప్పడామె అతనికి లొంగిపోతూ సంపూర్ణ సంతృప్తితో రసరమ్య సిద్ధితో కళ్ళు భారమై అలిసిపోయిన తనువు బరువై, హృదయం హృదయ పూర్వక హర్షాతిరేక సంపుటై.. .భర్త చెవిని తన్మయత్వంతో మునిపంటితో కొరుకుతూ అన్న డైలాగ్ "థాంక్స్ కృష్ణా! "

అలా అక్కడ ఊటీలో గడిపిన మూడు రోజులు అతని యాక్షన్ అదే...! ఆమె డైలాగూ అదే అదే!

తిరిగి హైద్రాబాద్ వచ్చేశాక ఇంటికి రావడంతోటే తన క్లోజ్ ఫ్రెండ్ బృందావనికి ఫోన్ చేసి అంది సావేరి "థాంక్స్! నీవిచ్చిన ఆయిడియా సక్సెస్. మా వారిలో యవ్వనమే తిరిగొచ్చిందా అనిపించింది. నిజమే! నీవన్నట్టు ప్రతి దంపతులకు వయసు మీద పడ్డాక ఎన్నో సమస్యలు .ఎదురౌతాయి. ఆర్థిక సామాజిక సమస్యలు, అదీగాకుండా ఇంట్లో ప్రయివసీ లేకపోవడం, పెళ్ళికెదిగిన పిల్లలున్నారన్న గిల్టీ ఫీలింగు, అదే మగవాళ్ళకయితే ఆఫీసులో బాస్ హెరాస్‌మెంట్, సబార్డినేట్స్ సమస్యలు, సేలరీ ఇంక్రిమెంట్లు, బోనస్‌లు, కొలీగ్ కొచ్చి తనకాగిపోయిన ప్రమోషను, రేట్లు పడిపోయిన షేర్లు, ఎంతకూ పెరగని సైట్ వాల్యూ, ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్స్, జుత్తులో మొలకెత్తుతున్న తెల్ల వెంట్రుకలు, బీటలుపడ్డ గోడలా శరీరంలో ముడతలు ఇవన్నీ మూకుమ్మడిగా దాడిచేయడంతో సెక్స్ మీద శ్రద్ధ తగ్గిపోతుంది. ఇటువంటి సందర్భంలో ఎప్పుడైనా హాఫ్ మూడ్‌తో సెక్స్‌లో పాల్గొని మధ్యలోనే అవుటయిపోతే అంతే! ఇక తనకు పుంసత్వం తగ్గిపోయిందన్న కమిట్‌మెంట్ కొచ్చేస్తారు కొందరు మగాళ్ళు. వాళ్ళలో వాళ్ళే కృంగిపోతారు. కొన్నాళ్ళకు మానసికంగా పూర్తిగా డల్ అయిపోతారు.

ఇక ఆ తర్వాత దాంపత్య జీవితం అంటేనే అయిష్టాన్ని పెంచుకుని పట్టె మంచాన్ని పడుకోవడానికి మాత్రమే ఉపయోగించే స్థితికి చేరుకుంటారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే 'ఓల్డ్ కపుల్ బట్ వాట్'కు ఏకాంతం కావాలి.

ఆ ఏకాంతం ఎప్పుడూ వుండే చోట తలుపులు మూసిన గదిలో దొరికే ఏకాంతం కాదు. హనీమూన్...సెకండ్ హనీమూన్‌కు వెళ్ళాల్సిన అవసరం ఎంతైనా వుంది. అలా ఈ రొటీన్‌నెస్‌కు దూరంగా వెళ్ళి రెగ్యులర్ లైఫ్‌ని మర్చిపోయినప్పుడు తమ అసలు పొటెన్సీ తమకు తెలీకుండానే దాగున్నది బయటపడుతుంది.

పెళ్ళయిన మొదట్లో హనీమూన్‌కు వెళ్ళడం ఎంత అవసరమో పెళ్ళయిన పాతికేళ్ళకు తిరిగి ఇలా సెకండ్ హనీమూన్‌కు వెళ్ళడం అంతకన్నా ఎక్కువ అవసరం. వయస్సు శరీరానికే కానీ మనస్సుకు కాదు అన్న రియలైజేషన్‌కు రావాలంటే సెకండ్ హనీమూన్‌కు తప్పక వెళ్ళాల్సిందే అని నీవిచ్చిన సలహా పాటించడం వలన నాకు ఎంతో మేలు జరిగింది. తిరిగి మళ్ళీ ఈనాడు మా ఆయనలో పాతికేళ్ళ క్రితం నాటి విద్యాంసుడిని చూడగలుగుతున్నాను" అంటూ సావేరి కృతజ్ఞతలు తెలిపింది బృందావనికి.

వాళ్ళ సెకండ్ హనీమూన్ అనంతరం నిజంగానే వాళ్ళ మధ్య...వాళ్ళ కోడ్‌లోనే చెప్పకుందాం...వెన్నెల ధారాపాతంగానే కురుస్తూనే వుంది!

అన్నట్లు ఈ మధ్య వాళ్ళ మనవడ్ని చిన్న కూతురు గదిలో పడుకోబెడుతున్నారన్న విషయం చెప్పనే లేదు.